ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -121 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం18 ఆగస్టు 2026

# దమ్ముంటే సభకు రండి

## డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.: వైసీపీకి చంద్రబాబు సవాల్





**మెగా డీఎస్సీ నియామకాల్లో అంతా పారదర్శకమేనన్న సీఎం చంద్రబాబు**
**అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం**
**డీఎస్సీపై వైసీపీది హిట్ అండ్ రన్ తరహా దుష్ప్రచారం అంటూ ఫైర్**
**దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్**
**148 రోజుల్లో 15,941 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడి**
**అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారని విమర్శ**

**అమరావతి ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు. విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా **మిగతా 2లో...**

# బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

## నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్



**13 మందికి జాతీయ ఉపాధ్యక్ష పదవులు**
**జాతీయ ప్రధాన కార్యదర్శులుగా 8 మంది..**
**కార్యదర్శులుగా 16 మంది పేర్లు ఖరారు**
**కొత్త టీమ్కు ప్రధాని మోడీ అభినందనలు**



న్యూఢిల్లీ:**ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** బీజేపీ అధిష్ఠానం పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, వసుంధరా రాజె, రామ్ మాధవ్ సహా 13 మంది పేర్లను ప్రకటించారు. **మిగతా 2లో...**

# నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**నాగబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ పదవి**
**కేబినెట్ హోదాతో నియామకం చేపట్టిన ప్రభుత్వం**
**రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యం**
**సోదరుడి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం**



**అమరావతి ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2లో...**

# జూడాల సమ్మె ఎఫెక్ట్

: వైద్య సేవలకు ఆటంకం లేకుండా ఏపీ సర్కార్ పటిష్ట చర్యలు




# టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

**టెట్ నుంచి మినహాయింపు కోరిన**
**ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్**
**ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు**
**సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్**
**టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ**



**ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, **మిగతా 2లో...**

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

**విద్యావైద్యరంగాలకు ప్రాధాన్యతిస్తున్నాం**
**ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కోసమే రూ.5,226 కోట్లు ఖర్చుచేశాం**
**వైద్యారోగ్య శాఖకు రూ.21,800 వెచ్చించాం**
**టెంకాయలు కొట్టి వదిలేసినోళ్లు టిమ్స్ కట్టామని గొప్పలా**
**ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు**
**సమయం పనిచేసే డాక్టర్లకు ప్రోత్సాహకాలివ్వండి**
**డాక్టర్ మర్రిచెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభోతవ్సంలో సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** పేదల వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నామనీ, వారి ఆరోగ్యం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్యావైద్య రంగాల కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ లో నూతనంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. **మిగతా 2లో...**

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

**ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా**
**స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా**
**14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్**






# మండలిలో డీఎస్సీ రగడ..

**బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్**
**డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు**
**విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు**
**అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు**
**గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా**

**అమరావతి ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన**మిగతా 2లో...**

# తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**ముసాయిదాలో 2.64 కోట్ల మంది పేర్లు**
**92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు వెల్లడి**
**నోటీసులకు సెప్టెంబర్ 16 వరకు గడువు**
**ఏఎస్‌డీడీ జాబితాలో 73 లక్షల మంది**



**హైదరాబాద్ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు**2లో...**

# ఏపీపై ఎల్ నినో పంజా..

## తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ



**అమరావతి ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు.

## నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

**మొదటిపేజీ తరువాయి**

ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు."మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు.తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు."మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో సర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల.

**మొదటిపేజీ తరువాయి** ఉన్నారని తెలిపారు. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది పేర్లతో ముసాయిదా జాబితా రూపొందించినట్లు చెప్పారు.మొత్తం ఓటర్లలో 78.03 శాతం మంది పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయని సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరోవైపు 73 లక్షల మంది ఓటర్లు ఏఎస్‌డీడీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్) జాబితాలో ఉన్నట్లు చెప్పారు. అన్‌మ్యాప్డ్ జాబితాలో ఉన్న 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.నోటీసులు అందుకున్నవారు తమ వివరాలపై వివరణ ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈ నోటీసులను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్లు చెప్పారు. తమ పేరు జాబితాలో లేకపోయినా అర్హత ఉన్నవారు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## మండలిలో డీఎస్సీ రగడ..

**మొదటిపేజీ తరువాయి**

బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు.సోమవారం ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు.

బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా? అధికారంలో ఉన్నప్పుడు చేతకాక, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక మండలిలో ప్రశ్నలు వేయడం రాజకీయ ద్వంద్వ నీతి కాదా?" అని బొత్సను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు సకాలంలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అయితే, దీన్ని అడ్డుకునేందుకు వైసీపీ ఏకంగా 300 కోర్టు కేసులు వేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు.ఈ క్రమంలో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. దీంతో వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. గందరగోళం నడుమ చైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత, అచ్చెన్నాయుడు తన అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ, తాను వాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కావని, ఒకవేళ చైర్మన్ రూలింగ్ ఇస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు నిరసన కొనసాగించడంతో, చైర్మన్ సభను రెండోసారి వాయిదా వేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీని ప్రకటించారు. పార్టీ జాయింట్ కోఆర్డినేటర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్, నాదీజ మోర్చా నూతన అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య పేర్లను ప్రకటించింది పార్టీ అధిష్ఠానం. అలాగే, సంస్థాగత జనరల్ సెక్రటరీగా దీ.నా.సంతోష్, సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీగా శివప్రకాష్ పేర్లను ఖరారు చేసింది బీజేపీ అధినాయకత్వం. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు దక్కలేదు. పైగా ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణను తప్పించారు.పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. అనుభవజ్ఞులైన నాయకులు, యువ నాయకుల సమ్మేళనంతో జాతీయ కార్యవర్గంలో ప్రాంతయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరిగా మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత పాత్రలోకి తిరిగి రావడం ఒక పెద్ద పరిణామం. తెరపైకి వచ్చిన మరో కీలక పేరు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ నియామకాలు దక్షిణ, తూర్పు రాష్ట్రాల వైపు మొగ్గు చూపుతున్న ధోరణిని సూచిస్తున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల నాయకులకు కీలక పదవులు లభించాయి.

# దమ్ముంటే సభకు రండి

**మొదటిపేజీ తరువాయి**

సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు.

13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు**

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?**

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

### సభలోనైనా, బయటైనా.. డిబేట్ కు నేను రెడీ: జగన్ కు నారా లోకేశ్ సవాల్

"గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి సవాల్ విసురుతున్నా. డీఎస్సీ-2025పై చర్చకు నేను సిద్ధం. సభ లోపలైనా, బయటైనా సరే.. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయండి" అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్ కు బహిరంగ సవాల్ విసిరారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై శాసనసభలో సుదీర్ఘ ప్రకటన చేసిన ఆయన, ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను బెయిల్‌పై లేనని, తనపై సీబీఐ, ఈడీ కేసులు లేవని, విదేశాలకు వెళ్లేందుకు తనకేమీ కోర్టు అనుమతులు అవసరంలేదని ఎద్దేవా చేశారు. చర్చకు వస్తే వాస్తవాలు తేలుతాయని అన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీపైనే అని లోకేశ్ గుర్తుచేశారు. ఈ నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, టీసీఎస్ అయాన్ వంటి సురక్షిత ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని వివరించారు. ఈ డీఎస్సీని అడ్డుకోవడానికే వైసీపీ నాయకులు 141 కేసులు వేశారని, సీఎం తొలి సంతకం అమలు కాకుండా అడ్డుకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు.

**ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి**

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందన్నది అవాస్తవమని, 42 వేల ప్రశ్నలతో కూడిన క్వశ్చన్ బ్యాంక్ నుంచి ర్యాండమ్‌గా ప్రశ్నలు వస్తాయని, లీకేజీకి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ప్రశ్నపత్రం రూపకల్పనలో ప్రమేయం లేదని, అతను శాఖాపరమైన అనుమతులు తీసుకోనందునే అనర్హుడయ్యాడని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గానికి మేలు చేశారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. మొత్తం 372 మందిలో 46 మంది ఓసీ, 185 మంది బీసీ, 112 మంది ఎస్సీ, 29 మంది ఎస్టీ అభ్యర్థులు ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే 65 క్రీడాంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, శాప్ ఆధ్వర్యంలో పారదర్శకంగా వెరిఫికేషన్ జరిపామని పేర్కొన్నారు.

**విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని లోకేశ్ విమర్శించారు. టీడీపీ హయాంలోనే 1.80 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లాలో వలస కూలీల పిల్లల దుస్థితిని చూసి, మెగా డీఎస్సీ ద్వారా ఆ జిల్లాకు అధిక సంఖ్యలో టీచర్లను కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అనుగుణంగా వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని, ఈ విధానాన్ని ప్రశ్నించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు.

**యువతకు భరోసా**

ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిందని యువతకు భరోసా ఇచ్చారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, వేలాది ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. "ఈ ఏడాది కూడా 3,000 పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తాం. ప్రతి ఏటా క్రమం తప్పకుండా టీచర్ పోస్టులను భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

డీఎస్సీ అంటే 'డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్' అని చెప్పే దౌర్భాగ్యపు పార్టీ రాష్ట్రంలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పారదర్శక నియామకాలకు మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరో మూడు డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు.

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం అక్కడ జరిగిన సభలో ఆరోగ్యదీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు. సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా టీసేఫ్ వ్యవస్థను ప్రారంభించారు. పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూడతెలంగాణ బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, ఆ భాషలను నేర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం అత్యంత ఖరీదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించాలనే లక్ష్యంతోనే సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను కడుతున్నా మని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు, మొత్తంగా ఆ రెండింటికీ రూ.5,226 కోట్లను ఖర్చుచేశామని వివరించారు. రెండేండ్లలో వైద్యారోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలను కట్టించాలనే సోయి గత ప్రభుత్వానికి ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. టిమ్స్ ఆస్పత్రులకు, వరంగల్ దవాఖానాకు కేవలం టెంకాయలుకొట్టి వదిలేశారనీ, పదేండ్లలో వాటిని ఎందుకు కట్టలేదని అడిగారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను 2027 డిసెంబర్ తొమ్మిదో తేదీకల్లా పూర్తిచేసి ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి స్పెషాల్టీ వైద్యసేవలను అందజేస్తామనీ, వాటిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. అవన్నీ పూర్తయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో పదివేల బెడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రికొచ్చే రోగుల సహాయకులు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డాక్టర్ ఎమ్‌సీఆర్ టిమ్స్‌లో సూపర్ స్పెషలిటీ పీజీ విద్య, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అదనంగా సమయం వెచ్చించి సూపర్ స్పెషలిటీ వైద్యసేవలందించే, సర్జరీలు చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను వేదిక నుంచే ఆదేశించారు. తాము సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు పగటివేషగాళ్లలా తిరిగి పోయారనీ, ఇది తామే కట్టామని కేటీఆర్ చెప్పి పోయారని విమర్శించారు. వెనక ఉన్న ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లి మానసిక రోగిని టిమ్స్ కట్టిన తమను గుర్తుపపట్టట్లేదా? అని కేటీఆర్ అడిగితేడ"ఈడికొచ్చినప్పుడు చార్మినార్ నేనే గట్టిన. హైదరాబాద్‌ను నేనే నిర్మించిన అనుకునేటోన్ని. ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేటోన్ని. ఈడ డాక్టర్లు మంచిగ చూస్తరు. రానురాను పిచ్చి తగ్గిపోతది లే అన్నడంట" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు సమయం ఉందిగానీ ప్రభుత్వ ఆస్పత్రులను కట్టించి ప్రారంభించేందుకు పదేండ్లలో సమయమే దొరలేదా? అని ప్రశ్నించారు. అబద్దాలు మానుకుని ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, నియోజకవర్గానికి పది నుంచి 20 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవచేస్తే చేసిన పాపాలు కొంతైనా తగ్గుతాయని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదనీ, ఇలా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటానన్నారు.

# జూడాల సమ్మె ఎఫెక్ట్

### : వైద్య సేవలకు ఆటంకం లేకుండా ఏపీ సర్కార్ పటిష్ఠ చర్యలు

ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్ల సంఘం (ఏపీ జూడా) చేపట్టిన సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలపై పడకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు ప్రారంభించింది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఈ మేరకు ప్రజారోగ్యం, వైద్య విద్య డైరెక్టరేట్ల నుంచి జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ అయ్యాయి.

సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్తలకు (డీసీహెచ్ఎస్) పలు సూచనలు చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, అనవసర రిఫరల్స్‌ను తగ్గించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరమైన చోటకు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలను తక్షణమే మెడికల్ కాలేజీలలో రిపోర్ట్ చేయాల్సిందిగా రిలీవ్ చేశారు.

సెలవుల్లో ఉన్న లేదా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వైద్యులు వెంటనే తిరిగి విధుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్, బోధనాసుపత్రులకు తాత్కాలిక డిప్యూటేషన్‌పై పంపేందుకు సీఎస్‌జీఈ, డీసీఎస్‌జీఈ వైద్యుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని (పీహెచ్‌సీ) రెండో వైద్య అధికారి సేవలను కూడా వినియోగించుకోనున్నారు.

మరోవైపు, వైద్య విద్య డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ ఎ. విష్ణువర్ధన్ కూడా కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను అధిగమించేందుకు తాత్కాలికంగా తమ సిబ్బందిని పంపాలని ప్రైవేట్ మెడికల్ కాలేజీలను అభ్యర్థించారు. ముఖ్యంగా పీడియాట్రిక్స్, అనస్థీషియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లను, డీఆర్‌పీ పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్లను సమీపంలోని బోధనాసుపత్రులకు పంపాలని సూచించారు.

అయితే, పీజీ రెసిడెంట్లు తప్పనిసరిగా సీనియర్ వైద్యుల పర్యవేక్షణలోనే పనిచేయాలని, వారికి ఎలాంటి స్వతంత్ర బాధ్యతలు అప్పగించరాదని స్పష్టంగా పేర్కొన్నారు. సమ్మె ముగిసే వరకు ప్రజలకు వైద్య సేవల్లో లోటు రాకుండా చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

**ఏపీలో ఉద్ధృతమైన జూడాల సమ్మె.. అత్యవసర సేవలు బంద్**

ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్లు (జూడాలు) తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపిస్తూ సోమవారం నుంచి అత్యవసర సేవలను (ఎమర్జెన్సీ సర్వీసెస్) సైతం బహిష్కరించి సమ్మెలోకి దిగారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఏర్పడింది.

గత జూలై నెల నుంచి ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినా ఎలాంటి సానుకూల స్పందన రాలేదని జూనియర్ డాక్టర్ల సంఘం నేతలు తెలిపారు. ఇప్పటివరకు రోగులకు ఇబ్బంది కలగకుండా నిరసన తెలిపామని, అయినా ప్రభుత్వం నుంచి హామీ లభించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని వారు స్పష్టం చేశారు.

తమకు ఇచ్చే స్టైపెండ్‌ను 30 శాతం పెంచాలన్నది జూడాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పెంపు తప్పనిసరి అని వారు కోరుతున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు.

ఈ నేపథ్యంలో నెల్లూరులో జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని జూడాల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని డాక్టర్లు హెచ్చరించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
మంగళవారం18 ఆగస్టు 2026

# పభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మరమ్మత్తులు చేయించండి

**భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి**



**నంద్యాల, ఆగష్టు 17, (రిపబ్లిక్ న్యూస్):** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయడం జరిగింది. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ స్థానిక నంద్యాల పట్టణంలోని 15వ వార్డులో ఉన్న గిరినాథ్ సెంటర్‌లోని పభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణం పూర్తిగా నిర్వీర్యం అయింది. దీనివల్ల ఇక్కడ మద్యపానం పొగ తాగడం గంజాయి అసాంఘిక కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి. వెంటనే పూర్తిస్థాయిగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. పూర్తిస్థాయిలో క్లీన్ చెయ్యాలి, కాలేజీ చుట్టూ నూతన ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ దీపాలు, మత్తు, మాదక ద్రవ్యాలను కాలేజీ ఆవరణలో పూర్తిస్థాయిగా నిషేధించాలని, కాలేజీ ఆవరణం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాలేజీకి మెయిన్ గేట్ దగ్గర నైట్ టైం ఒక సెక్యూరిటీ గార్డెన్ ఎర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కి వినతి అందజేసి కోరడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిరాం రెడ్డి ఎల్ఎల్‌బి, జిల్లా అధ్యక్షుడు, జై సింహ రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేంద్ర నాయక్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో 74 ఉద్యోగ ఖాళీలతో జాబ్ డ్రైవ్

**ఈ నెల 22న సునయన ఆడిటోరియంలో ఇంటర్వ్యూలు**

**ఐటిఐ నుంచి ఎంబీఏ వరకు అర్హతలున్న వారికి అవకాశం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 17)**
స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ శనివారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జాబ్ డ్రైవ్ పోస్టర్‌ను జిల్లా మేజిస్ట్రేట్ డా. ఎ. సిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రతి నాలుగో శనివారం ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
జాబ్ డ్రైవ్‌లో ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ రాయలసీమ ఆల్కాలిస్ & అలైడ్ కెమికల్స్ లిమిటెడ్, జై రాజ్ ఇస్పత్ లిమిటెడ్. సంస్థలు పాల్గొంటున్నాయి. ఆయా సంస్థల్లో మొత్తం 74 ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐటిఐ, డిప్లొమా, బి.టెక్, డిగ్రీ , ఎం.ఎస్.సి, ఎంబీఏ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు పోస్టర్‌లో పేర్కొన్న అర్హతల ప్రకారం ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాలు, అనుభవ ధ్రువపత్రాలతో జాబ్ డ్రైవ్‌కు హాజరుకావాలని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ పి. దీప్తి కోరారు. మరిన్ని వివరాల కోసం 6300009183 / 8374231357 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

# రైతులతో చెలగాటమాడుతున్న రెవెన్యూ అధికారులు





**ఎమ్మిగనూరు, ఆగష్టు, 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తే రెవెన్యూ అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ హెచ్చరించారు. వందలాది ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు, 30 ఏళ్లుగా రైతులు వినియోగిస్తున్న దారిపై నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. నందవరం మండలం గురజాల గ్రామానికి చెందిన రైతులు సర్వే నంబర్ 155కు సంబంధించిన వంకను గత 30 ఏళ్లుగా పొలాలకు వెళ్లేందుకు దారిగా వినియోగిస్తున్నారని తెలిపారు. అప్పట్లో రైతులంతా కలిసి సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి దారిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. గతంలో తహసీల్దార్ విచారణ జరిపి రైతులు ఎన్నో ఏళ్లుగా దారిని వినియోగిస్తున్నందున తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. రాజకీయ ఒత్తిళ్లతో రైతులకు దారి లేకుండా చేయాలని చూస్తే సహించేది లేదని గురురాజ్ దేశాయ్ అన్నారు. రైతులపై నోటీసులు జారీ చేయడంతో పాటు బైండోవర్ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చనిపోయిన రైతుల పేర్లతోనూ, సెంటు భూమి కూడా లేని వ్యక్తుల పేర్లతోనూ నోటీసులు జారీ చేయడం రెవెన్యూ అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. గత 30 ఏళ్లుగా రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న దారిపై అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, రైతులపై నమోదు చేసిన బైండోవర్ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు లోకాయుక్తను ఆశ్రయిస్తామని గురురాజ్ దేశాయ్ స్పష్టం చేశారు.

# నెల రోజులుగా తెరుచుకోని గ్రామపంచాయతీ..

## వెనుదిరికి వెళుతున్న అర్జీదారులు



**ఆళ్లగడ్డ ఆగష్టు 17రిపబ్లిక్ న్యూస్ :**ఆళ్లగడ్డ తాలూకా లోని సిరువెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం సుమారు నెలరోజులు కావస్తున్న తాళం వేసిన తలుపులు తెరుచుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి స్కాలర్షిప్ల ఇతర బ్యాంకు విత్ డ్రా లు కోసం సంతకాల అవసరాల నిమిత్తం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వస్తూ అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగి వెళుతున్నారని గ్రామ ప్రజలు తెలియజేశారు. రెగ్యులర్ కార్యదర్శి సెలవుల్లో వెళ్లారని ఇన్చార్జి కార్యదర్శి అసలు రావడం మానేశారని మండల స్థాయి అధికారులు స్పందించి సక్రమంగా విధులు నిర్వహించే కార్యదర్శులను తమ గ్రామానికి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఓటర్ల సర్వే కులాల వారీగా ఓటర్ల జాబితా తయారీ ఇతర సర్వేలు జరుగుతుంటే తమ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న చిరు వర్షాలకు అక్కడక్కడ సాగు అవుతున్న మాగాని పంటలకు దోమలు ఉత్పత్తి అవుతున్నాయని అంటువ్యాధులు ప్రబలకుండా తగిన సూచనలు సలహాలు అందించాల్సిన సమయంలో గ్రామ కార్యదర్శి లేకపోవడం పట్ల పలువురు పలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో మరియు డిఎల్పిఓ వంటి అధికారులు స్పందించి గ్రామ కార్యదర్శి సక్రమంగా విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని వీరారెడ్డిపల్లె గ్రామపంచాయతీ ప్రజలు కోరారు.

# ఎత్తుకెళ్లే వాహనాలతోనే జీవనోపాధి

**ద్విచక్ర వాహనాల ముఠా సభ్యులు అరెస్ట్**

**రూ. 29 లక్షలు విలువ చేసే 20 వాహనాలు రికవరీ**

**మీడియాకు వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి చంద్రశేఖర్**



పోలీసులు అరెస్టు చేసిన ద్విచక్ర వాహనాల నిందితుడు

**అనంతపురం క్రైమ్, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం నగరంలో వరస ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయి. వివిధ ఆసుపత్రులు, జనసంచారం రద్దీగా లేని కార్యాలయాలు, ప్రముఖ హోటల్లను ఆసరాగా చేసుకుని దొంగలు నగరంలో రెచ్చిపోతున్నారు. " యువకుల జల్సా" ఉపాధిగా మారడంతో నేరాలకు పాల్పడుతున్నారు. దొంగలించిన వాహనాలను వివిధ మార్గాలలో ట్రాన్స్పోర్ట్ చేసి తక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనంతపురం నగరం తో పాటు, తిరుపతి, దొడ్డబల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలను దొంగలించారు. ఉపాధి మార్గంగా ఉన్న ద్విచక్ర వాహనాల అక్రమ వ్యాపారం అక్రమార్కులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది అని చెప్పవచ్చు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

**రూ.20 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం**

ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ నగరంలో రెండు నెలలుగా ద్విచక్రవాహనాల చోరీలు జరుగుతున్నాయి. అందులో భాగంగా వాహన తనిఖీలను ముమ్మరం చేసి మోటార్‌సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ప్రధాన నిందితుడితోపాటు ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నార్పల మండల కేంద్రంలోని చైతన్యకాలనీకి చెందిన కుమ్మర కిషోర్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. నగరంలో వరుసగా ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతుండటంతో వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలపై దృష్టి సారించారు. కిషోర్‌తోపాటు ముగ్గురు మైనర్లు కలిసి ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 20 మోటార్‌సైకిళ్ల విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

**జిల్లా ఎస్పీ జగదీష్ సిబ్బందికి రివార్డులు అందజేత**

ఈ వాహనాలు ఎక్కడెక్కడ చోరీకి గురయ్యాయి.. మరిన్ని చోరీలకు ఈ ముఠాతో సంబంధం ఉందా.. వీరి వెనుక మరెవరైనా ఉన్నారా.. అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రెండు నెలలుగా కొనసాగుతున్న వాహన చోరీలను ఛేదించి నిందితులను అరెస్టు చేయడంతోపాటు భారీగా ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బందికి రివార్డులు అందజేసినట్లు తెలిపారు. వాహనదారులు తమ ద్విచక్రవాహనాలను సురక్షిత ప్రాంతాల్లోనే పార్క్ చేయాలని, వాహన భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని పోలీసులు సూచించారు. వాహనం చోరీకి గురైన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నేరస్థుల పై చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఏ ఇతర కారణాలతో నైన నేరాలకు పాల్పడినా వారి వెన్నుక ఎంతటి వారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు.





పోలీసులు అరెస్టు చేసిన హత్య కేసు నిందితుడు

# బ్యాంకు ఆర్థిక స్థితి బలోపేతమే లక్ష్యం

**ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి**

**ఎన్‌పీఏల తగ్గింపుపై ఏడీసీసీబీ ప్రత్యేక సమీక్ష**





**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆర్థిక స్థితిని బలోపేతమే లక్ష్యమని ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగాకేంద్ర సహకార బ్యాంకు (ఏడీసీసీబీ) పరిధిలో మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గించేందుకు కాంప్రమైజ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (సీఎస్ఎస్)ను విస్తృతంగా వినియోగించాలని బ్యాంకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బ్యాంకు శాఖలు, అనుబంధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పరిధిలో సీఎస్ఎస్ అమలు, రుణ బకాయిల వసూళ్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. **సడలింపుల, రుణ ఖాతాల పరిష్కారానికి చర్యలు**

ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్లు కె.విజయ్ చంద్రారెడ్డి, కె.సురేఖారాణి, డీజీఎం ఏబీ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. అనంతపురం 1వ రోడ్డు, ఓల్డ్‌టౌన్, రామ్‌నగర్, పామిడి శాఖలతో పాటు ఆయా శాఖల పరిధిలోని పీఏసీఎస్‌ల రుణ బకాయిలు, ఎన్‌పీఏల పరిస్థితిని సమీక్షించారు. సంబంధిత శాఖల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, పీఏసీఎస్ సీఈవోలు, అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యారు. రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రైతులు, ఖాతాదారులకు సీఎస్ఎస్ ద్వారా అందుబాటులో ఉన్న రాయితీలు, వడ్డీ మినహాయింపులు, ఇతర సడలింపులను వివరించి రుణ ఖాతాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ కేశవరెడ్డి సూచించారు.

**పటిష్టం చేసేందుకు ఎన్‌పీఏల నియంత్రణ కీలకం**

ప్రతి పీఏసీఎస్ పరిధిలో పథకంపై విస్తృత అవగాహన కల్పించి అర్హులైన రుణగ్రహీతలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. బ్యాంకు ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంతో పాటు సహకార రంగ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఎన్‌పీఏల నియంత్రణ కీలకమని పేర్కొన్నారు. బకాయిల వసూళ్లలో శాఖల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, పీఏసీఎస్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, సీఎస్ఎస్ ద్వారా సాధ్యమైనంత ఎక్కువ రుణ ఖాతాలను పరిష్కరించేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# వీబీ జీ రామ్ జీ పథకంలో పనుల కల్పనకు వేగం పెంచాలి

**పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు -జలధారజలహారతి పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 17)**
వీబీ జీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు పనులు కల్పించడంలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి డ్వామా పీడీని ఆదేశించారు. పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీజీఆర్ఎస్, రీసర్వే, జలధారజలహారతి తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకం కింద తుగ్గలి మండలంలో శ్రామికులకు పనులు కల్పించడంలో మంచి పురోగతి ఉందన్నారు. అయితే కౌతాళం, మంత్రాలయం, కోసిగి తదితర మండలాల్లో పనుల కల్పనలో పురోగతి చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఆయా మండలాల్లో పనుల సంఖ్యను పెంచాలని సంబంధిత ఏపీఓలను ఆదేశించారు. పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురోగతి తక్కువగా ఉన్న మండలాల్లో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు.

**జలధారజలహారతి పనులపై ప్రత్యేక దృష్టి**

జలధారజలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనుల పురోగతిపై ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించిన పనుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన పనుల నమోదు, మంజూరు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
అర్హత కలిగిన మిగిలిన పనులను కూడా త్వరితగతిన గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు ప్రారంభించిన వివరాలను ప్రతిరోజూ నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పీజీఆర్ఎస్ అర్జీలు గడువు దాటకుండా పరిష్కరించాలి**

పీజీఆర్ఎస్‌కు సంబంధించి అధికారుల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై ఏ అర్జీ కూడా నిర్ణీత గడువు దాటకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**రీసర్వే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి వీఆర్వోల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల వారీగా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, ఆలస్యానికి గల కారణాలను గుర్తించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.
అదేవిధంగా తహసీల్దార్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, డ్వామా పీడీ నరసింహారెడ్డి, డీఎంహెచ్ఓ డా. కామేశ్వర ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి, డీటీసీ శాంతకుమారి, డీసీహెచ్ఎస్ డా. జాఫ్రుల్లా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి.

**ఓర్వకల్లు లో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు.**

**పేషంట్లకు బెడ్, ఫ్రూట్స్ పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి,ఏపీయూడబ్ల్యూజే నాయకులు**





**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు 17 (రిపబ్లిక్ న్యూస్)**
జర్నలిస్టుల హక్కుల సాధననే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యంమని ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు గోపాల్, శేఖర్, ఉపాధ్యక్షుడు రాజేష్,కోశాధికారి ఇంతియాజ్, స్వాములు, అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఏపీయూడబ్ల్యూజే నాయకుల ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి మరియు ఏపీయూడబ్ల్యూజే నాయకులు కలిసి పేషెంట్లకు బ్రెడ్, ఫ్రూట్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని అన్యాయాలను ఎండగడుతూ, ప్రజల గొంతు కాగా నిలిచి అక్షర యోధులకు నేడు రక్షణ ఏదని ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే పాత్రికేయుల భరోసా కల్పించే బాధ్యత ఎవరిదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్న జర్నలిస్టుల సమస్య మాత్రం పట్టించుకోలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, రోజురోజుకు విలేకరులపై దాడులు బెదిరింపులు పెరుగుతున్నాయని వెంటనే ప్రత్యేక భద్రత చట్టాన్ని అమలు చేయాలని తెలియజేశారు. ప్రమాద భీమ పునరుద్ధరణ గతంలో అమల్లో ఉండి నిలిచిపోయిన జర్నలిస్టులకు సమగ్ర బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించి, క్షేత్ర సాయి రిపోర్టర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి, అర్హులైన జర్నలిస్టులు అందరికీ వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గౌరవప్రదమైన పాత్రికేయులకు పింఛన్ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. వెంటనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర అడుగులు వేయాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల సాధనకై రాజ్యలేని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు, రాజు, కుమార్,హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఎల్ సి ఆయకట్టుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలి

**తుంగభద్రలో 93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నా రైతులకు నీరందడం లేదు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 17)**
తుంగభద్ర డ్యామ్‌లో ప్రస్తుతం 93 టీఎంసీల నీటి నిల్వ ఉందని, కర్నూలు జిల్లాలోని ఎల్ఎల్సీ (తుంగభద్ర దిగువ కాలువ) ఆయకట్టు భూములకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాకు రావాల్సిన నీటి వాటా పూర్తిస్థాయిలో అందకుండా కర్ణాటకలో నీటి చౌర్యం జరుగుతోందని ఆరోపించారు. నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నీటి వాటాను సక్రమంగా విడుదల చేయాలని కోరారు.
కర్నూలు జిల్లాకు ప్రధాన నీటి వనరైన ఎల్ఎల్సీ కాలువ కింద వేలాది ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయని, ఇప్పటివరకు కాలువకు సాగునీరు విడుదల కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని నాయకులు తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు పూర్తి నీటి



సామర్థ్యం 106 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 93 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కూడా బాగానే ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటా ప్రకారం ఎల్ఎల్సీ కాలువకు 650 క్యూసెక్కుల నీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎల్ఎల్సీకి నీరు విడుదల చేస్తే ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ పంటలను సాగు చేసుకునేందుకు రైతులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయని, మరికొంత ఆలస్యం అయితే పంటలను కాపాడుకునే అవకాశం కూడా కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.
రైతులు వరి నార్లు పోసుకుని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాలువలో నీరు లేకపోవడంతో నాట్లు వేయలేకపోతున్నారని తెలిపారు. నాట్లు వేసే సమయం దాటిపోయిన తర్వాత నీరు విడుదల చేసినా ప్రయోజనం ఉండదని, అందువల్ల ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.
తుంగభద్ర ప్రాజెక్టు ఇంజినీర్లతో జిల్లా కలెక్టర్ చర్చించి, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన రాష్ట్ర వాటా మేరకు ఎల్ఎల్సీ కాలువకు నీటిని విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, తుంగభద్ర బోర్డు అధికారులు, కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసి నీటిని విడుదల చేయించి కర్నూలు జిల్లా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

# 109 ఫిర్యాదులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్పందన

**చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 17)**
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.
కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 109 ఫిర్యాదులు అందాయి.
వాటిలో కర్నూలు జిల్లా కల్లూరు మండలం ముజఫర్‌నగర్‌కు చెందిన చిరంజీవిరాజు, కరీంనగర్‌కు చెందిన సూర్య రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.11.10 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు.
మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామానికి చెందిన తాయన్న తన మూడున్నర ఎకరాల పొలాన్ని కొప్పు వెంకటేష్, కొప్పు రాగన్నలు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు.





తుగ్గలి మండలం రోళ్లపాడు తండాకు చెందిన నాగేంద్ర నాయక్, సురేష్ నాయక్, డాకే నాయక్, రాజు నాయక్‌లు తమ పొలాల్లో 400 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి రూ.35 లక్షల నష్టపరిహారం ఇస్తామని చెప్పి రూ.10 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన రూ.25 లక్షలు ఇప్పించాలని కోరారు.
హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన నాగరాజు, ఇతర రైతులు ఎరువులు, సబ్సిడీ విత్తనాలు ఇప్పిస్తామని చెప్పి 16 మంది రైతుల నుంచి రూ.20.46 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు.
కర్నూలు వార్త ఆఫీస్ సమీపంలోని స్థలం విషయంలో కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, తాము ఇచ్చిన డబ్బులు, బంగారం తిరిగి ఇప్పించేలా న్యాయం చేయాలని షరాఫ్ బజార్‌కు చెందిన వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన అంజన్‌రెడ్డి కోర్టు ఆర్డర్ కాపీ ఉన్నప్పటికీ స్థలం విషయంలో న్యాయం జరగడం లేదని ఫిర్యాదు చేశారు.
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు మస్తాన్ వలి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి చొరవతో మరో 552 మంది కళాకారులకు ఉచిత కళ్లద్దాలు

## క్రోచెట్ లేస్ కళకు కొత్త వెలుగు

**,అమరావతి, ఆగస్టు 1ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చొరవతో హస్తకళాకారుల జీవితాల్లో ఆరోగ్య వెలుగులు నింపే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పది రోజుల క్రితం నరసాపురం ఇంటర్నేషనల్ లేస్ సెంటర్‌లో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో దృష్టి లోపాలు గుర్తించిన 552 మంది క్రోచెట్ లేస్ కళాకారులకు సోమవారం ఉచిత కళ్లద్దాలు అందజేశారు. ఈ నెల 9వ తేదీన నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 700 మంది కళాకారులకు




కంప్యూటరైజ్డ్ పవర్ టెస్టులు, కంటి ఒత్తిడి పరీక్షలు, రెటీనా స్కానింగ్, స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించి కంటి ఆరోగ్యాన్ని అంచనా వేశారు. నాటి పరీక్షల్లో 552 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారణ కావడంతో, అక్కడే ఫ్రేములు తయారు చేసి ఉచితంగా అందించే ఏర్పాటును ఉప ముఖ్యమంత్రి చేశారు. శిబిరంలోనే కళాకారులు తమకు నచ్చిన ఫ్రేమ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. పది రోజుల్లో అవసరం ఉన్న ప్రతి కళాకారుడికీ ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఇదే శిబిరంలో 45 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని వైద్యులు సూచించగా, మరుసటి రోజే 12 మందికి కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పూర్తి చేయించిన విషయం విదితమే. తదుపరి ఆచంట, అత్తిలి తదితర గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు పూర్తవగా, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వారికి తదుపరి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రక్తదానం చేయండి ప్రాణ దాత గా నిలవండి



**ఆళ్లగడ్డ ఆగష్టు 17 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని డాక్టర్ రామకృష్ణారెడ్డి హాస్పటల్లో చాగలమర్రి కి చెందిన గర్భవతి అయిన శ్రీమతి విజయలక్ష్మి కి O+VE గ్రూపు (ప్రసవం సందర్భంగా), రక్తం అవసరం కాగా వివేకానంద సేవాసమితి నీ సంప్రదించగా , వివేకానంద సేవాసమితి సభ్యుడు అయిన రక్తదాత ఆ.చంద్రసేన స్పందించి రక్తదానం దానం చేయడం జరిగింది.దాత చంద్రసేన కు పేషెంట్ తరపు వారు దాతకి కృతజ్ఞతలు తెలిపారు రక్తదాత చంద్రసేన సేవ దృక్పథం తో 15 వ సారి రక్త దానం చేయడం జరిగింది.
ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని రక్తదానం చేయడానికి వెనుకాడుతున్న ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి మూడు నెలలు ఒకసారి రక్తదానం చేస్తే రక్తకొరత తగ్గి ఆపదలో ఉన్న అనేక మంది ప్రాణాలు రక్షించవచ్చు అని తెలియజేస్తున్నామని స్వామి వివేకానంద సేవ సమితి వారు కోరారు.

# కవులూరి నారాయణరెడ్డి పార్థివదేహానికి రామిరెడ్డి ధ్వజారెడ్డి నివాళులు.





**రైల్వే కోడూరు ఆగస్టు 17 రిపబ్లిక్ న్యూస్.** వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు కవులూరి నారాయణరెడ్డి మరణ వార్త తెలుసుకున్న వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు, అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు మీ కుటుంబానికి అండగా ఉంటామని మరోసారి ఇచ్చారు కవులూరు నారాయణరెడ్డి మృతి ఆయన కుటుంబానికి వైఎస్ఆర్సిపి పార్టీకి తీవ్ర నష్టమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఆయనతోపాటు పుల్లంపేట మండల ఎంపీపీ వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ముద్ద బాబు రెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు కుటుంబ సభ్యులకు సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు
ఈ కార్యక్రమంలో అనంతరాజుపేట షఫీ , ప్రసాద్ , కంభం శ్రీనివాసులు రెడ్డి,, లక్ష్మీపతి మరియు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# అంబరాన్ని తాకిన పంతగాని పుట్టినరోజు సంబరాలు.





**రైల్వే కోడూరు ఆగస్టు 17 రిపబ్లిక్ న్యూస్.**
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు అంబరాన్ని తాకినంత ఘనంగా అభిమానులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు, ఈ వేడుకలు రైల్వే కోడూరు లోని పి ఎన్ పి కార్యాలయంలో సోమవారం అత్యంత వైభవంగా ఆయన అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆయనకు గజమాల వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేళాలు తాళాలు డబ్బులతో ఖానా బజానా తో ఊరేగింపుగా ఆయనను కార్యాలయంకు తీసుకొచ్చారు అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేష్ బాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుండయ్య నాయుడు, జనసేన పార్టీ నాయకులు యనమల భాస్కర్, పాల్గొని అంతగాని నరసింహ ప్రసాద్కు శాలువలు కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు, ఆయన అభిమానులు కార్యకర్తల మధ్య ఉషారైన డ్యాన్సులతో పాటలతో ఆయన పుట్టినరోజు సంబరాలు అంబరాన్ని తాకినంత ఘనంగా నిర్వహించారు, బొబ్బే ధనంజయ, యువ నాయకుడు దినేష్ యాదవ్, పూలమాలవేసి సెలవు కప్పి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులు మిత్రులు పాల్గొనడం జరిగినది.





# శాస్త్రీయ నృత్యంలో "విజేత"

## సాయి "విజయం" స్ఫూర్తిదాయకం

## ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం.విజయశ్రీ





**అనంతపురం స్పోర్ట్స్, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లోనూ వైద్య విద్యార్థులు ప్రతిభను చాటడం అభినందనీయమని అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం.విజయశ్రీ అన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో గుంటూరులోని ఎన్నారై మెడికల్ కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ మెడికల్, డెంటల్ కళాశాలల కల్చరల్ ఫెస్ట్‌లో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఫైనల్ ఇయర్ వైద్య విద్యార్థిని పరిణీత సాయి క్లాసికల్ డాన్స్ సోలో విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. 60కి పైగా వైద్య, దంత వైద్య కళాశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో పరిణీత సాయి "మహిషాసుర మర్దిని" పాటకు శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్నారు. విజేతగా నిలిచిన ఆమెకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ సాయి సుధీర్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం.విజయశ్రీ పరిణీత సాయితోపాటు పాల్గొన్న వైద్య విద్యార్థులను తన ఛాంబర్‌కు ఆహ్వానించి శాలువాలతో సత్కరించి అభినందించారు.

**సాంస్కృతిక రంగంలో ప్రతిభను చాటడం అభినందనీయం**

పరిణీత సాయి సాధించిన విజయం కళాశాలకే కాకుండా తోటి వైద్య విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తూనే సాంస్కృతిక రంగంలో ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపిస్తూ మంచి ఫలితాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ శంకర్, పాథాలజీ హెచ్ఓడీ ఆచార్య డాక్టర్ శివశంకర్ నాయక్, కల్చరల్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ మీనిగ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్ తదితరులు పాల్గొని పరిణీత సాయిని అభినందించారు.

# భవన నిర్మాణ కార్మికులకు మళ్లీ భరోసా

**- 'మన మిత్ర' యాప్ ద్వారా కార్మికుల నమోదుకు అవకాశం**

**- అసెంబ్లీలో మంత్రి వాసంశెట్టి సుభాష్ వివరణ**

**అమరావతి, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఖ్య ఎందుకు పెరగడం లేదన్న అంశంపై శాసనసభలో మంత్రి వివరణ ఇచ్చారు. 2018-19 నాటికి రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని మంత్రి తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో 1214 మెమో ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో నమోదు ప్రక్రియ ఒక్కసారిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత రెండు నెలల్లోనే 6,777 మంది కార్మికులు కొత్తగా నమోదు చేసుకున్నారని వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికులు అంటే కేవలం నిర్మాణ రంగంలో పనిచేసేవారే కాదని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణ పనుల్లో 90 రోజులకు పైగా పనిచేసే కార్మికులు కూడా నమోదు చేసుకునేందుకు అర్హులని, అలాగే మైనింగ్ రంగంలో పనిచేసే కార్మికులు కూడా భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారని వివరించారు.

# ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి

**అసెంబ్లీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**చర్చల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**

**-జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



**అమరావతి, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** 'అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున జనసేన బలమైన గొంతు వినిపించాలి. అసెంబ్లీ జరిగే ప్రతి నిమిషం విలువైనదే. ప్రజలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ప్రజాప్రతినిధులుగా బాధ్యతగా సభ ముందుకు తీసుకురావాలి. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొనాల'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు, జనసేన లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి తీవ్ర జ్వరం ఉండటం మూలంగా సభకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రివర్యులు అందించే సూచనలు అనుసరిస్తూ సభా కార్యక్రమాలలో పాలుపంచుకుందాము అన్నారు. శాసనసభ వర్షకాల సమావేశాలు సోమవారం మొదలైన సందర్భంగా సభలో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని మంత్రి కందుల దుర్గేష్ , ఎమ్మెల్సీ నాగబాబు తో కలిసి మనోహర్ సోమవారం అసెంబ్లీలోని జేఎల్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ "ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం దొరుకుతుంది. పవన్ కళ్యాణ్ మార్గదర్శకంలో సభలో జనసేన సభ్యులందరం హుందాగా, క్రమశిక్షణగా నడుచుకోవాలి. చర్చ సందర్భంగా ప్రతి విషయం మీద లోతుగా అధ్యయనం చేసి సభలో మాట్లాడాలి. అలాగే నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించేలా ప్రజల గళం కావాలి. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం రాష్ట్రంపై ఉండే అవకాశం కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య, సాగునీటి సమస్యలను సభలో చర్చించేందుకు సమాయత్తం కావాలి. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా పనిచేయాలి. వివిధ కీలక అంశాల మీద సభలో జరిగే చర్చలో జనసేన పార్టీకి కేటాయించే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మండలి సమావేశాలకు వైసీపీ వచ్చినా, సభను సజావుగా జరగకుండా అడ్డుపడటమే వారి ఉద్దేశంగా కనిపిస్తోంది. అక్కడ కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. అన్ని చర్చల్లో పాల్గొవాలి. శాసనసభ, మండలి జరిగే అన్ని రోజుల్లో జీరో అవర్ నుంచి ప్రశ్నోత్తరాలకు, చర్చలకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉండాలి" అని సూచించారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# దేశంలో నిశ్శబ్ద విప్లవం మొదలైంది

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ -రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, అప్పులు,అవినీతే ..



**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** దేశంలో 50 కోట్ల మంది నిరుద్యోగులు భవిష్యత్తుపై ఆందోళనతో, నిస్పృహతో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. నగరంలోని మాసినేని గ్రాండ్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, నిరుద్యోగం, అప్పులు, అవినీతి తదితర అంశాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ దేశంలో ఆదాయాలు తగ్గి, అప్పులు పెరుగుతున్నాయని, మూడు పూటలా భోజనం చేయలేని పరిస్థితుల్లో అనేక కుటుంబాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దానిని పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి త్వరలోనే "నిశ్శబ్ద విప్లవం" గా మారుతుందని చింతా మోహన్ వ్యాఖ్యానించారు.

**పెద్ద మొత్తంలో కార్పొరేట్ సంస్థలకు రాయితీలు**

ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఇచ్చిన ఉద్యోగాలు, నల్లధనం వంటి హామీలను చింతా మోహన్ ప్రస్తావించారు. కోట్లాది మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా నిరుద్యోగ సమస్య కొనసాగుతోందన్నారు. నల్లధనం వెనక్కి తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి డబ్బు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశంలో భారీగా అప్పులు పెరుగుతున్నాయని, ఆ అప్పుల భారం చివరకు సామాన్య ప్రజలపైనే పడుతోందని అన్నారు. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్న కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, మాఫీలు లభిస్తున్నాయని ఆరోపించిన ఆయన, అందులో పేద ప్రజలకు ఎంత ప్రయోజనం దక్కిందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ దేశానికి అత్యంత కీలకమని చింతా మోహన్ అన్నారు. రాజ్యాంగ విలువలను విస్మరిస్తే దేశ సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. దేశాన్ని ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలతోనే ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ అవినీతి తీవ్రంగా ఉందని చింతా మోహన్ ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ల నుంచి ఇసుక, మైనింగ్ రంగాల వరకు అవినీతి జరుగుతోందన్నారు. సహజ వనరులను దోచుకుంటున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో దాదాపు మూడు దశాబ్దాలుగా రెండు రాజకీయ కుటుంబాలే అధికారం చెలాయిస్తున్నాయని, వారి పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల పాలనలో పేరుకుపోయిన అప్పులు, వడ్డీల భారంపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు.

తమిళనాడులో సినీ రంగం నుంచి వచ్చిన నాయకుడు విజయ్ దళపతి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజుల పాలన పూర్తి చేసుకున్నారని చింతా మోహన్ ప్రస్తావించారు. అక్కడ అవినీతికి తావులేని పాలన అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజలకు పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించాలని డిమాండ్ చేశారు.

**జగన్ ముఖ్యమంత్రి పదవిని ...**
**వదులుకోవడానికి సిద్ధంగా లేరు**

ముద్రగడ పద్మనాభం మరణం అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులు తనను కలచివేశాయని చింతా మోహన్ తెలిపారు. తనను చూసి కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత బాధలకు దారితీయకూడదన్నారు.

జగన్ ముఖ్యమంత్రి పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శించిన చింతా మోహన్, రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి వైపు చూడాల్సిన సమయం వచ్చిందన్నారు.

**నిరంతరం పోరాటం చేస్తూ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తా**

దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునరుజ్జీవనం అవసరమని చింతా మోహన్ అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు కాంగ్రెస్‌లోకి రావాలని అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పతనానికి కాంగ్రెస్‌నే కారణమా అన్న ప్రశ్నకు స్పందిస్తూ, కాంగ్రెస్ బలహీనపడటానికి అనేక రాజకీయ కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామని చింతా మోహన్ తెలిపారు.

# అక్రమార్కుల గుండెల్లో...దడ

**భూ దందాపై కలెక్టర్ కొరడా**

**ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో మార్పు**

**భూ వ్యవహారంలో...**

**నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్**

**మరో ముగ్గురికి ఛార్జ్‌మెమోలు..**

**రికార్డుల పరిశీలనలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం**



**తాడిపత్రి క్రైమ్, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అక్రమార్కుల గుండెల్లో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ దడ పుట్టిస్తున్నారు.

ఈ సందర్భంగా నిషేధిత ఆస్తుల జాబితా ప్రక్రియలో భాగంగా ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్ లో మార్పులు జరిపిన వాటిపై జిల్లా కలెక్టర్ కొరడా ఝులిపించి కొందరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వాటితో పాటు మరికొందరికి ఛార్జ్ మెమోలు జారీ చేశారు. జిల్లాలో ఈ విషయం పెను సంచలనంగా మారింది. ఏ సందర్భంలో ఏ అధికారి జిల్లా కలెక్టర్ కంట్లో పడతారో అర్థం కాని పరిస్థితి జిల్లాలో నెలకొంది.

**నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగింపు**

తాడిపత్రి భూ వ్యవహారంలో రికార్డుల పరిశీలన, ధ్రువీకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు రెవెన్యూ ఉద్యోగులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు ఉద్యోగులకు ఛార్జ్‌మెమోలు జారీ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. తాడిపత్రి మండలం తాడిపత్రి గ్రామంలోని సర్వే నంబరు 770-ఈ2లోని 2.40 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ (1)(డి) కింద నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించే ప్రక్రియపై కలెక్టర్ సమగ్రంగా రికార్డులను పరిశీలించారు.

**డి.పట్టా(ఎల్.సి.)గా..డాక్యుమెంట్‌లో "సీలింగ్ ల్యాండ్"గా**

ఈ సందర్భంగా ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో నమోదుల్లో మార్పులు జరిగినట్లు కనిపించడం, తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లోని 17, 18 పేజీలు కనిపించకపోవడం, 1-బి రిజిస్టర్, అడంగల్‌లో భూమి డి.పట్టా (ఎల్.సి.)గా నమోదై ఉండటం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో "సీలింగ్ ల్యాండ్"గా పేర్కొనడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు. అలాగే ఆర్డీఓ కార్యాలయంలోని ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో సీసీ నంబరు 2963/75 తాడిపత్రి కింద సర్వే నంబరు 770-ఈ 2లోని 2.40 ఎకరాలకు సంబంధించిన నమోదు కూడా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. సంబంధిత అధికారులు భూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించకపోవడం, అవసరమైన విచారణ, ధ్రువీకరణ చేపట్టకపోవడం, రికార్డుల్లోని వ్యత్యాసాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడం, విధి నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వంటి అంశాలపై చర్యలు తీసుకున్నారు.

**రికార్డులలో లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం**

తాడిపత్రి అప్పటి తహసీల్దార్ (ఎఫ్ఏసీ), ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ జి.సోమశేఖర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి కె.వెంకటస్వామి, జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహమ్మద్ షఫీలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికీ ఛార్జ్‌మెమోలు కూడా జారీ చేశారు. మరోవైపు అనంతపురం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ యు.రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ కార్యాలయంలో ల్యాండ్ రిఫార్మ్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కె.పవన్‌కుమార్, అనంతపురం ఆర్డీఓ కార్యాలయం అప్పటి డీఏఓ (ఇన్‌చార్జి) ఎస్.బి.కుళ్లాయప్పలకు ఛార్జ్‌మెమోలు జారీ చేసి శాఖాపరమైన విచారణకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు, నిషేధిత ఆస్తులకు సంబంధించిన రికార్డుల పరిశీలనలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల ధ్రువీకరణలో లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. బాధ్యతల నిర్వహణలో లోపాలు గుర్తించిన ప్రతి సందర్భంలో నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పల్లె ఉమా పవిత్ర స్మృతులను మరువం

**పల్లె కుటుంబ సభ్యులు**

**పల్లె ఉమా జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించిన కుటుంబ సభ్యులు**



**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 17,(రిపబ్లిక్ న్యూస్):** సంఘసేవకురాలు అయిన కీ.శే. పల్లె ఉమ చేసిన సేవలను, ఆమె అందించిన స్ఫూర్తిని ఎప్పటికీ మచిపోలేమని పల్లె కుటుంబ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి, దివంగత పల్లె ఉమా జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పల్లె ఉమా ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి ఆమెను స్మరించుకున్నారు. పల్లె ఉమా జయంతిని పురస్కరించుకుని ఘాట్ వద్ద ప్రత్యేకంగా పుష్పాలు సమర్పించి, ఆమె పవిత్ర స్మృతులను గుర్తుచేసుకున్నారు.

**పల్లె ఉమా వ్యక్తిత్వం తమకు స్ఫూర్తిదాయకం**

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పల్లె ఉమా భౌతికంగా తమ మధ్య లేకపోయినా ఆమె అందించిన ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు, కుటుంబ సభ్యుల పట్ల చూపిన అనురాగం ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. కుటుంబ బంధాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే పల్లె ఉమా వ్యక్తిత్వం తమకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె మానవతా విలువలు, సేవా దృక్పథం, ఆత్మీయతను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో తోడుగా నిలిచి, ఆప్యాయతను పంచిన పల్లె ఉమా జ్ఞాపకాలు తమకు చెరగని అనుభూతిగా మిగిలిపోయాయని తెలిపారు.

**పల్లె ఉమా పవిత్ర స్మృతులు ఎప్పటికీ మార్గదర్శకం**

ఆమె అందించిన ధైర్యం, చూపిన ఆప్యాయతను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. పల్లె ఉమా చిత్రపటానికి, సమాధి వద్ద పుష్పాలు సమర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె జీవితాన్ని, కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధాన్ని, మానవతా విలువలను స్మరించుకున్నారు. పల్లె ఉమా సేవా భావం, ఆత్మీయతను కుటుంబ సభ్యులు కొనియాడారు. పల్లె ఉమా పవిత్ర స్మృతులు తమ



కుటుంబానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని, ఆమె ఆశయాలను కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పల్లె ఉమా జయంతి సందర్భంగా ఘాట్ వద్ద పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించి ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

# దేశం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో తెలంగాణ నెంబర్ వన్

## మంత్రి వివేక్ వెంకట స్వామి







**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 17**
మెదక్ లోని కలెక్టరేట్ కార్యాలయంలో మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణి చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలకు అనేక కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని వైఎస్ హయంలో పావుల వడ్డీ రుణాలు ప్రారంభించారనీ గుర్తు చేశారు.రూ 23వేల కోట్ల రూపాయలు మహిళలకు రుణాలు అందించామని,ఈవి వాహనాలను కూడా మహిళలకు అందిస్తున్నామన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం ,
పేదలకు సన్నబియ్యం ఇస్తుందన్నారు.
పేద పిల్లలకు స్కూల్స్ లలో సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నాం అని,సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు మంచి భోజనం పెడుతున్నామన్నారు.త్వరలో విద్యార్థులకు ఫ్రీ టిఫిన్ పెడుతున్నామని, ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగ పడాలన్నదే ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు.గత ఏడాది మూడు వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాం. ఈ ఏడాది మరో 2500ఇల్లు ఇస్తున్నాం అని తెలిపారు.ఏ ఊరిలో పెంకుటిల్లు కనిపించవద్దన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ 10లక్షల వరకు వైద్యం అందిస్తున్నామని,విద్యా, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుంది పేర్కొన్నారు.రూ 200కోట్ల రూపాయలతో ఇంటిగ్రెటెడ్ స్కూల్స్,పబ్లిక్ స్కూల్స్ తరహా లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపిస్తున్నాం అని వివరించారు పేదలకు ఉచితంగా 200యూనిట్ల కరెంట్ వస్తున్నామని,స్మార్ట్ కార్డు ల లో ఫ్యామిలీ డిటైల్స్ ఉన్నాయి. దేశంలో ఎక్కడ అమలు చేయడం లేదన్నారు.గతంలో రేషన్ కార్డులలో అవకతవకలు జరుగుతుండే కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదనీ స్పష్టం చేశారు. భూగర్భ గనుల శాఖ ద్వారా రూ 1000కోట్ల ఆదాయం తెచ్చామన్నారు.మహిళలకు 2500 ఇస్తామని మాట ఇచ్చామో ఇచ్చి తీరుతాం అని పునరుద్ఘాటించారు.తెలంగాణ లో ఆర్థిక పరిస్థితి బాగుచేసేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారన్నారు.
మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు .
గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి,పేదలకు సన్న బియ్యం, జీరో విద్యుత్, సబ్సిడీ సిలిండర్ లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారుఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, గ్రంధా లయాల చైర్మన్ సుహాసిని రెడ్డి, ట్రేని ఆర్డీవో అహ్మద్ మొహమ్మద్, మెదక్, రామయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల చైర్పర్సన్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిన నిండు గర్భిణి కుటుంబానికి న్యాయం చేయాలి

### ఆస్పత్రి సిబ్బంది, విధుల్లో ఉన్న వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి:
### ఎమ్మార్పీఎస్. మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్) ఆగస్టు 17**
సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన నిండు గర్భిణి భైరి అనిత ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు పూర్ర సంతోష్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భైరి అనిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.భైరి అనిత ఆగస్టు 10, 2026న సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, ఆగస్టు 12న మృతి చెందిందని తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ విషాద ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన ఆస్పత్రి సిబ్బంది, విధుల్లో ఉన్న వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
నిండు గర్భిణి మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు.అందోల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా ఉన్న దామోదర్ రాజనర్సింహ ఈ ఘటనపై స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గందగళ్ల వీరయ్య మాదిగ, కొండాపూర్ మండల ఇన్‌చార్జ్ కందుకూరి వినయ్, మునిపల్లి మండల సమన్వయకర్త జంగం నవీన్, రాజు, భైరి అనిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులు, వృద్ధాప్య పింఛన్ల కోసం బిఆర్ఎస్ ధర్నా

### మల్లాపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా ఎంపీడీఓ కు వినతిపత్రం.





**మల్లాపూర్ ఆగష్టు 17 (రిపబ్లిక్ న్యూస్)**
బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్లాపూర్ మండల కేంద్రంలో బీడీ కార్మికులకు పింఛన్, వృద్ధులకు వృద్ధాప్య పింఛన్ అందించాలని, అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బీడీ కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. బీడీ కార్మికులకు పింఛన్ అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని, అర్హులైన వృద్ధులందరికీ వృద్ధాప్య పింఛన్ అందించాలని నాయకులు డిమాండ్ చేశారు.
అలాగే పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.బిఆర్ఎస్ నాయకులు తమ డిమాండ్లను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పలు డిమాండ్లతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపిస్తామని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో బిఆర్ఎస్ నాయకులు ధర్నాను తాత్కాలికంగా విరమించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించి తగిన చర్యలు తీసుకోని పక్షంలో 15 రోజుల అనంతరం మరోసారి ధర్నా చేపడతామని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.
అనంతరం బీఆర్ఎస్ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మల్లాపూర్ ఎంపీడీఓ అల్వాల శ్రీకాంత్ కు సమర్పించారు.
ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కదుర్క నర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నగేష్, జిల్లా రైతు బంధు సమితి మాజీ సభ్యులు దేవా మల్లయ్య, సర్పంచులు చిట్యాల లక్ష్మణ్, తీట్ల లహరి రాజేష్, జెల్ల రాజేశ్వర్, హైదర్, ఉప సర్పంచులు గణవేని నందిని మల్లేష్, మద్దెల నర్సయ్య, నాయకులు శరత్ గౌడ్, లింగస్వామి, భైరి రవికుమార్ యాదవ్, ఆకుతోట రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట ఎస్సి బి బాలుర వసతి గృహంలో

### విద్యార్థులకు యూనిఫామ్ షూస్ అందజేసిన జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి మైనారిటీ యూత్ లీడర్ చోటు ఖాన్





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 17**
అందోల్ మండలం జోగిపేట లో ఎస్సి బి బాలుర వసతి గృహంలో విద్యార్థులకు యూనిఫామ్ షూస్ అందజేసిన జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున ఎస్సీ వెల్ఫేర్ అధికారులు ఎప్పటికప్పుడు సమాయత్తం చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమయపాలనతో అందించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు విద్యార్థులకు వసతి గృహంలో దగ్గరుండి కలిసి మెలిసి ఉంటున్న వసతి గృహం అధికారి ఏ మహేశ్వర్ ఆ వసతి గృహం సిబ్బందిని ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో వసతి గృహం అధికారి మహేశ్వర్ సార్ వసతి గృహం సిబ్బంది రాజు విద్యార్థులు పాల్గొన్నారు

# కొండగట్టు ఘోర రోడ్డు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### జనసేన పార్టీ జగిత్యాల జిల్లా సీనియర్ నాయకులు బెక్కం జనార్దన్ డిమాండ్








**రాయికల్ మండలం ఆగస్టు17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సులారీ ఢీకొని పలువురు ప్రయాణికులు గాయపడిన ఘటన తీవ్రంగా కలచివేసిందని జనసేన పార్టీ జగిత్యాల జిల్లా సీనియర్ నాయాకులు బెక్కం జనార్దన్ అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, చికిత్స ఖర్చులను ప్రభుత్వం పూర్తిగా భరించాలని బెక్కం జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే ప్రత్యేక వైద్య సహాయం, అవసరమైన అత్యవసర చికిత్స అందించాలని కోరారు. అలాగే ప్రమాదానికి అసలు కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కొండగట్టుజగిత్యాలకరీంనగర్ ప్రధాన రహదారిపై రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధికారికంగా వివరాలు వెల్లడించాలని అన్నారు."ప్రమాద బాధితులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించే వరకు జనసేన పార్టీ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుంది" అని బెక్కం జనార్దన్ స్పష్టం చేశారు.

# రాయికల్ పట్టణానికి వచ్చే రోడ్ల బ్రిడ్జిలు వద్ద రోడ్లను వెంటనే డశీబర్ రోడ్డు వేయాలని ప్రజావాణిలో వినతి పత్రం ..సమర్పించిన జగిత్యాల జిల్లా ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి




**రాయికల్ మండలం ఆగష్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బింగి చిరంజీవికి ప్రజావాణి పలు సమస్యలతో మొట్టమొదటి వినతిపత్రం సమర్పించిన ఆడేపు రాజమౌళి
రాయికల్ మండల కేంద్రము మరియు పరిసరాల ప్రాంతాల ప్రజల సమస్యల తమ దృష్టికి తీసుకు వస్తున్నాము అని ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడేపు రాజమౌళి తెలిపారు
అలాగే జగిత్యాల్ నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల రాయికల్ పట్టణము నిత్యము 60 కి పైగా గ్రామాల ప్రజలు మన అంతర్జిల్లా రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే వ్యాపార విద్యా కేంద్రము నలుమూలల ప్రయాణ సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం నెలకొన్న బ్రిడ్జిల దగ్గర ఆగిపోయి రహదారుల దుస్థితి రాయికల్ పట్టణ ప్రగతికి శాపంగా మారింది పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు రామజిపేట్ బతుకమ్మ వాగు బ్రిడ్జి ఆగిపోయిన రహదారుల పనులు గోరంగా దెబ్బతిని ప్రయాణికులకు తీవ్ర ఆటంకం కలిగిస్తుంది కోరుట్ల మేడిపల్లి, మూడు మండలాల సరిహద్దులను కలిపి ఈ కీలక బ్రిడ్జి దగ్గర రోడ్డు పనులు నిలిచిపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు ఇటిక్యాల వాగు రోడ్డు నిర్మల్ మార్గం అంతర్ జిల్లా రాకపోకలకు కీలకమైన ఈ రహదారి అత్యంత అధ్వాన్నంగా స్థితికి చేరి గోతుల మాయంగా మారింది ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నిత్యము రాకపోకలు సాగించే పాఠశాలను కళాశాల బస్సులు విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్కు తరలించడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే అంబులెన్సులు కార్మికులు ప్రయాణికుల వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి కావున ప్రజా సేవ దృష్టిలో ఉంచుకొని రామాజీపేట మైదాపూర్ బ్రిడ్జిల్లా వద్ద నిలిచిపోయిన రహదారి పనులను తక్షణమే పునరుద్ధరించి ఇటిక్యాల రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి తెలియజేశాడు రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనాదారులు పాదచారులు సైకిళ్లు,సైకిల్ మోటార్లు కార్లు లారీలు బస్సులు రకరకాల వాహన దారులకు ముప్పు తిప్పలు అవుతున్నాయి అలాగే విద్యార్థులు వృద్ధులు ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నారు ముఖ్యంగా ప్రస్తుతము వర్షాకాలంలో బురదమయం అవుతున్నాయి రహదారి నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి ప్రజలకు రాకపోకల సౌకర్యము కల్పించాలని ప్రజావాణి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను యుద్ధ ప్రాతిపదికపై రామాజీపేట బ్రిడ్జి మైదాపూర్ బ్రిడ్జి ఇటిక్యాల బ్రిడ్జి నిధులు సమకూర్చి యుద్ధ ప్రాతిపదికపై శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆడపు రాజమౌళి తెలియజేశారు

# హైకోర్టులో స్టే కారణంగానే కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం అమలులో జాప్యం పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల మంజూరు - రాయికల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్



**రాయికల్ మండలం ఆగస్టు 17( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతను సవాలు చేస్తూ అడ్వకేట్ విజయ్ గోపాల్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా చెక్కుల పంపిణీలో జాప్యం ఏర్పడిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్ అన్నారు.సోమవారం జగిత్యాల జిల్లా రాయికల్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన నిరుపేద ఆడ బిడ్డ కుటుంబానికి కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ హైకోర్టు పిటిషన్ తోనే జాప్యం ఏర్పడిందని తెలిసి కూడా బిఆర్ఎస్ నాయకులు రోడ్డెక్కి ధర్నా చేయడం విడ్డురంగా ఉందన్నారు. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ పథకాల అమలను చూసి ఓర్వలేక ఉనికి కోసమే నిరసన తెలుపుతున్నారన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన గడిచిన 10ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లను,పెన్షన్ ఇవ్వలేదని 2 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను,ఉచిత బస్సు,ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం వంటి మహోన్నత కార్యక్రమాలను అమలు చేసిందన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో పెన్షన్ వచ్చే భర్త మృతి చెందితే భార్యకు వితంతు పింఛన్ వచ్చేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం 7 రకాల పింఛన్ల కు ప్రభుత్వం దరఖాస్తుకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.ప్రజలు సంతోషంగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని వారిని తప్పుదోవ పట్టించేందుకు నిరసనలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు.అర్హులైన వారు ఈపాస్ ద్వారా కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ దరఖాస్తులు తీసుకుంటుందని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేస్తున్నారని పథకం అమలు ఎక్కడ ఆగలేదన్నారు.బీడీ పెన్షన్ టేకేదార్ పెన్షన్ లేబర్ అధికారుల ద్వారా ప్రభుత్వం సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,రాయికల్ మున్సిపాల్ 8 వార్డ్ కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, నాయకులు పిప్పోజి మహేందర్ బాబు,సుధావేణి మురళి,అల్లే పురుషోత్తం,సుదర్శన్,ముక్కెర ప్రసాద్,అనుమండ్ల చంద్ర తేజ,కాసవేని రాజేష్, గట్టు నవీన్, కొత్తపెల్లి అరవింద్,కటుకం సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ ప్రజావాణి లో పలు సమస్యలపై ఎండిఓ కు వినతిపత్రం అందించిన మహితాపూర్ గ్రామ వార్డు సభ్యులు

**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
నూతనంగా ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి నోడల్ అధికారి బింగి చిరంజీవి పర్యవేక్షణ లో బాగంగా స్థానిక తహసిల్దార్ నాగార్జున మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

ఈ కార్యక్రమంలో మహితాపూర్ గ్రామంలో పలు సమస్యలు మూడవ వార్డు యందు కోడి మ్యాల, శారదా పారిపేలి మల్లయ్య, సంగ రాజు సందు లో కరెంట్ స్తంభాలు లేకపోవడంతో రాత్రివేళల్లో కరెంటు సరఫరా లేక ఆ సంది నడిచే వారికీ అక్కడ నివసిస్తున్న ఇండ్లకు సంబంధించిన వారి ఇండ్ల లో చాలా పెద్ద నాగు పాము లు ఇతర పాములు తరచుగా వస్తున్న నేపథ్యంలో అందరూ భయాందోళనకు గురవుతున్నారు. అందుకని మూడవ వార్డు లో మరియు ఒక్కటో వార్డు యందు కొయ్యడి సదా శివ రెడ్డి ఇంటి సందులో కరెంటు స్తంభాలు లేకపోవడంతో మరియు బేతి రాధ ఇంటి ముందు కొట్ట మూల వద్ద కరెంటు స్తంభాలు లేక పోవడంతో రాత్రి వేళల్లో అందరికీ ఇబ్బందులు పడుతున్నారు మరియు రెండవ వార్డు ఎనిమిదో వార్డు యందు బుడగజంగల కాలనీల యందుఅవసరమైనచోట్ల. అందుకుగాను వెంటనే స్తంభాలు ఏర్పాటు చేసి



సమస్యలను పరిష్కరించాలని వార్డు సభ్యులు కోరారు

**మహితాపూర్ గ్రామ గన్నే గుట్ట దుర్గ మాతా ఆలయం వద్ద బస్సులు ఆపాలని వినతిపత్రం అంద చేసిన వార్డు సభ్యులు.**
మహితాపూర్ గ్రామంలో వెలసిన కనక దుర్గమ్మ గుడి దగ్గర గన్నే.గుట్ట పైన ఉన్న అమ్మవారిని దర్శించుకునుట కోరకు గ్రామస్తులు మరియు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మరియు రాయికల్ మండల కేంద్రమైన పట్టణంలో నుండి మరియు కోరుట్ల మండలం నుంచి జగిత్యాల మండలం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు కానీ అటు కోరుట్ల బస్టాండ్ మరియు ఇటు రాయికల్ బస్టాండు వద్ద ప్రజలు మరియు దుర్గ మతా భక్తులు అధిక సంఖ్యలో బస్సులో ప్రయాణిస్తున్న శీదు వలన అక్కడ ప్రతి రోజూ మరియు ప్రతీ శుక్రవారం రోజూ చాలా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు కావున దుర్గ మాత ఆలయం గన్నె గుట్ట




వద్ద బస్సు లను అపాకా పోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అక్కడికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వెంటనే బస్సు లు ఆపాలని ఈ రోజు జరిగిన రాయికల్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారి నోడల్ అధికారి భింగి చిరంజివి గారికి వినతిపత్రం గ్రామ పంచాయతీ పరిధిలోని మూడవ వార్డు సభ్యులు అనుమల్ల రమ సత్యనారాయణ ఎనిమిదో వార్డు సభ్యులు యాదవ సంఘం అధ్యక్షులు బుస గంగా మల్లయ్య ఆరో వార్డు సభ్యులు భూపల్లి పరమేష్ లు కలిసి వినతిపత్రం అందజేశారు.

# రాయికల్ ప్రజావాణిలో మూట పెల్లి బిఆర్ఎస్ పార్టీ శాఖ పలు సమస్యలతో వినాతి పత్రం అభివృద్ధి అధికారికి అందజేసిన అలుపట్ల లక్ష్మణ్

**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
సమస్యలపై రాయికల్ మండల కేంద్రంలో జరిగిన "ప్రజావాణి"లో సంబంధిత అధికారులకు మూటపెల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం ముటపల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అలుపట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ కెసిఆర్ బీడీలు చేసే ఆడబిడ్డలు అడగకముందే 2000 రూపాయల పెన్షన్ ఇచ్చిండు మా అవ్వలకు తాతలకు 200రూపాయలు ఉన్న పింఛన్ ను 2000 చేసిండు కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులను, వృద్ధులను విస్మరించడం చాలా దారుణం. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన కొత్తగా ఒక్క పెన్షన్ ఇచ్చిన దాఖలాలు లేవు ప్రజా పాలన పేరిట పదేపదే దరఖాస్తులు తీసుకుంటూ ప్రజల సమయాన్ని సొమ్మును వృధా చేయడం తప్ప వీళ్ళు



చేసిందేమీ లేదు ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నూతన దరఖాస్తులలో బీడీ కార్మిక పెన్షన్ మరియు వృద్ధాప్య పెన్షన్ చేర్చాలని మూటపెల్లి బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాము. అదేవిధంగా మా ఇంటి ఆడబిడ్డ కు పెళ్లి అయితే కెసిఆర్ కన్న తండ్రి లెక్క కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలు ఇచ్చిండు మా మైనారిటీ ఆడబిడ్డలకు షాదీ ముబారక్ పథకం కింద లక్ష రూపాయలు ఇచ్చిండు కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేక కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలు నిలిచిపోయాయి వెంటనే ఈ పథకాలను అమలులోకి తేకపోతే రానున్న రోజుల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి గారి రాజకీయ అనుభవంతో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత అక్క నేతృత్వంలో గ్రామ గ్రామాన మండల వ్యాప్తంగా స్తంభింప చేస్తామని హెచ్చరిస్తున్నాము... ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారులు మూట పెల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు మాజీ సర్పంచ్ మండ రమేష్, ప్రజాప్రతినిధులు వార్డ్ మెంబర్లు ఏలేటి రాజెశీదఆర్ రెడ్డి, తోగారి లక్ష్మినర్సయ్య, అచ్చ వినీత్, ఏనుగు హనుమంత రెడ్డి,కంటే రఘు,ఆలు పట్ల లక్ష్మణ్ గ్రామ బిఆర్ఎస్ శాఖ కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రముఖ పర్యాటక కేంద్రంగా మెదక్ ఖిల్లా

## గనుల, భూగర్భ,ఉపాధి కార్మిక, పారిశ్రామిక శాఖల, ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి

**మెదక్ ఖిల్లా పై ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ ఆవిష్కరణ**

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 17**
మెదక్ పట్టణంలోని చారిత్రక మెదక్ ఖిల్లా పై ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్‌ను రాష్ట్ర పర్యాటక, బొగ్గు గనుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ...మెదక్ ఖిల్లాకు ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. పురాతన కాలంలో నిర్మించిన మెదక్ ఖిల్లా పేరుతో ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ విడుదల చేయడం అభినందనీయమని, ఇందుకు పోస్టల్ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ కింద ఖిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ నుంచి నిధులు తీసుకువచ్చేందుకు ఎంపీ రఘునందన్ రావు కృషి చేయాలని సూచించారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మెదక్ జిల్లా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని మంత్రి విమర్శించారు. మెదక్‌ను పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం



తరఫున కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ చర్చి అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగంలో జిల్లాకు మరింత గుర్తింపు తీసుకువస్తామని స్పష్టం చేశారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.... మెదక్ ప్రాచుర్యాన్ని గుర్తించి భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్టాంప్ కవర్ ప్రారంభోత్సవం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్టాంపు ఆవిష్కరణ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. పురాతన కట్టడం గా పేరొందిన ఈ కోట ప్రాచుర్యాన్ని గుర్తించి స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ప్రాచీన కాలంలో కట్టిన కోటలు పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం శుభ పరిణామంగా



పేర్కొన్నారు. గతంలో కాకతీయ రాజుల కాలంలో మన మెతుకు సీమ అనే వచ్చిందన్నారు. మంజీరా పరివాహక ప్రాంతంలో పండిన వరి గింజలతో కాకతీయ రాజులకు అన్నం పెట్టేదని ఈ జిల్లాకు మెతుకు సీమ అని పిలవబడిందన్నారు. అనేక రాజకీయ కారణాలవల్ల ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యాల వల్ల పూర్తిగా మెదక్ జిల్లా అని నిర్లక్ష్యానికి గురైందన్నారు, ఒక దశలో నిరాహార దీక్షలో కొట్లాడి మెతుకు సీమ జిల్లా కావాలనే దుస్థితి ఈ జిల్లా ప్రజలు నెట్ట వేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తూ చివరగా మెదక్ జిల్లా సాధించుకోవడం
జరిగిందన్నారుఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,మెదక్ ఆర్డీవో రమదేవి, డి ఎస్ పి ప్రసన్న కుమార్ ,పోస్టల్ శాఖ అధికారులు,మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ను కోరిన...
## -రాయికల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర్ హనుమాన్లు ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్

**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు, రాయికల్ నాగారం హనుమాన్లు ఆలయంలో



చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు అవసరమైన సౌకర్యాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోరా హనుమాన్లు, రాయికల్ సివిల్ కాంట్రాక్టర్ గంద్ర అచ్యుతరావు, మచ్చ శేఖర్, సుధ వేణి మురళి గౌడ్, వాసం రాజేందర్, ఇర్ఫాన్, పల్లికొండ గంగాధర్ తదితరులు ఉన్నారు అలాగే "జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో హనుమాన్ దేవాలయ లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేసినా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెంట ప్రజలు నాయకులు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు"

# కొత్తపేట రాజరాజేశ్వర నాగాలాయంలో ప్రత్యేక పూజలు చేసిన రాయికల్ తాసిల్దార్ నాగార్జున మండల అభివృద్ధి అధికారి బింగి చిరంజీవి





**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా, రాయికల్ మండలం, కొత్తపేట గ్రామం లో కల శ్రీ రాజ రాజేశ్వర నాగాలయం యందు నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న రాయికల్ తాసిల్దార్ నాగార్జున మండల అభివృద్ధి అధికారి బింగి చిరంజీవి ప్రభుత్వ అధికారులు ప్రత్యేక పూజలు చేశారు మండలంలో కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయానికి ఒక ప్రత్యేకత ఉంది అని మండల అభివృద్ధి అధికారి చిరంజీవి అన్నారు అలాగే భక్తులు ఉదయం ప్రత్యేక అభిషేకములు, అర్చన పూజలు ఆలయ అర్చకులు చెఱకు రాజేశ్వర శర్మ వైదిక నిర్వహణలో నిర్వహించారు అనంతరం చింతలపెల్లి విజయ - గంగారెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమం లో రాయికల్ తహశీల్దార్ నాగార్జున, ఎంపిడిఓ చిరంజీవి, జీపీఓ దశ కుమార్, గిరిదవవారు దాసరి పద్మయ్య మరియు ఈఓ ఎం విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పెడివెల్లి నర్సయ్య,ఆలయ చైర్మన్ దానవేని రాము, ధర్మకర్తలు పల్లపు వెంకటి, ముక్కెర ముత్యం, సత్య నారాయణ రావు, సతన్న, కొత్తపేట సర్పంచ్ శ్రీమతి మీనుగు రాజ గంగు - అంజయ్య, ఉప సర్పంచ్ తునికి రంజిత్, ఒడ్డెర కాలనీ సర్పంచ్ చంద్ర శేఖర్, ఉప సర్పంచ్ రాజేష్, మాజీ సర్పంచ్ బత్తిని రాజేశం, మాజీ ఉప సర్పంచ్ రాజ శేఖర్ మరియు పలు ఆలయాల, పోలీస్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయంలో ప్రత్యేక పూజలు చేసినా రాయికల్ మాజీ ఎంపీపీ లౌవుడ్య సంధ్యారాణి సురేందర్ నాయక్



**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల తాజా మాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి
డీసీసీ జగిత్యాల జిల్లా గిరిజన విభాగం అధ్యక్షులు లావుడ్యా సురేందర్ నాయక్ నాగపంచమి పండగ సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో రాజరాజేశ్వర నాగాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి పుట్టలో నాగ దేవతకు పాలు పోయడం జరిగింది..
వారితోపాటు గ్రామ సర్పంచ్ మీనుగు రాజగంగు అంజయ్య, ఆలయ చైర్మన్ రాము, ఆలయ ఈఓ విక్రమ్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ పెడువల్లి నరసయ్య, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ బత్తిని రాజేశం గౌడ్, మాజీ ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ రాజశేఖర్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు





# రాష్ట్రంలో "కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను" నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించిన రాయికల్ మున్సిపల్ ఉపాధ్యక్షులు తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి

**రాయికల్ మండలం ఆగస్టు,17( రిపబ్లిక్ న్యూస్ )**
రాష్ట్ర బి. ఆర్. యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీర్ ఆదేశాల మేరకు జగిత్యాల్ జిల్లా రాయికల్ మండల కేంద్రంలో బి.ఆర్.యస్ శ్రేణుల నిరసన తెలిపారు గత ప్రభుత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అప్పటి ముఖ్యమంత్రి, కెసిఆర్ ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్య తీరును ఖండిస్తూ మరియు అర్హులైన వృధులకు , బీడి కార్మీకులకు ఆసరా పింఛన్ లో అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మండల మరియు పట్టణ బి.ఆర్.యస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిలిపివేసిన ప్రజా సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి, రైతు భీమా ప్రీమియంను వెంటనే చెల్లించాలని,రైతులకు ఎలాంటి ఆంక్షాలు లేకుండా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి మరియు విద్యార్థులకు నిలిపివేసిన ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగింది. లేనియడల బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతుని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ ఆఫీస్ ప్రజావాణి లో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యకమంలో మండల మరియు పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్ , ఎలిగేటి అనిల్, మున్సిపల్ వైస్ ఛైర్మన్





తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి , కౌన్సిలర్లు రాకేష్ నాయక్ , సర్పంచ్ గుమ్మడి సంతోష్,ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రావు, మహేష్ గౌడ్, నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి , మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, నాగరాజు, గంగాధర్, ఎనుగంటి రవి, సుధీర్ రెడ్డి,కన్నక మహేందర్,అత్తినేని గంగారెడ్డి, చాంద్ పాషా,దివాకర్ రెడ్డి,ప్రశాంత్ రావు, రాజేందర్ గౌడ్, కోసరి మహేష్, మురళి, రమాపతిరావు, రాజేశ్వర్రావు,రోట్టె శ్రీను, శివనీతి గంగారెడ్డి,సోహైల్, సుతారి తిరుపతి, నరేష్, నవీన్, షాకీర్, గంగమల్లయ్య, సత్యనారాయణ,అనుమల్ల మహేష్, రాంప్రసాద్, జానా గంగాధర్, మహేందర్ యాదవ్, కట్కం సాయి,రాజేష్, కొమ్ముల గంగారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జలపతిరెడ్డి, రమణారెడ్డి, నరేష్ గౌడ్ , చంద్రయ్య, రాంచంద్రరావు, తిరుపతిరెడ్డి, చిలక శ్రీను, పురుషోత్తం,నాగుల మహేష్, పడాల సత్యం, మధు, రాజు, దారవత్ శ్రీను, సత్యంగౌడ్, లక్ష్మారెడ్డి, మంగిలాల్, బుజ్జక్క, అదిత్య, నర్సింహారెడ్డి,శేఖర్, అస్లాం, సాగర్ మరియు పెద్ద సంఖ్యలో బి.ఆర్.యస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకోండి

**సంతృప్తి స్థాయిలో ప్రజా సమస్యల వేదికలో వచ్చిన అర్జీలపై పరిష్కారం చూపాలి**

**రీఓపెన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**పీజీఆర్ఎస్‌లో 307 ప్రజా వినతులు స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 17 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో, నాణ్యతతో సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ( ్రా+=ూ) అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించి తీసుకున్న చర్యలను ఎండార్స్మెంట్ లో స్పష్టంగా తెలపాలన్నారు. నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి వారికి సరైన పరిష్కారం చూపాలి అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ లో భాగంగా పిజిఆర్ఎస్పై పైన ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. అలాగే అధికారుల లాగిన్‌లో ఇంకా పరిశీలించని దరఖాస్తులను పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా అందుతున్న వినతులపైనా ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 167 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలోనే భూ సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 167 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, స్వర్ణ గ్రామ/వార్డులకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 8, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 6, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 61, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 43, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 34, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు..వన్ మంత్ ఫోర్ విజిట్స్ కార్యక్రమాన్ని నందికొట్కూరు నియోజకవర్గం లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.






**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) గోస్పాడు మండలం, తెల్లపూరి గ్రామానికి పాశం వెంకటయ్య వృద్ధాప్య పింఛను మంజూరు చేయించగలరని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) దొర్నిపాడు మండలం, చాకరాజువేముల గ్రామానికి చెందిన పి.లక్ష్మిదేవికి అన్ని అర్హతలు ఉన్నపట్టికీ రైతు భరోసా పథకం క్రింద జమ అయ్యే నగదు జమ కాలేదని తగు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు

3) నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.పి.వై రెడ్డి మోడల్ కాలనీ, క్రాంతి నగర్, బొమ్మలసత్రం నివాసితులకు త్రాగు నీటి కొరత వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మంచినీటి సదుపాయం పునరుద్ధరించగలరని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

## గుంటూరు,గుంతకల్లు రైల్వే డబ్లింగ్, విద్యుద్దీకరణ పనుల భూసేకరణపై జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా పరిశీలన





**నంద్యాల బ్యూరో, ఆగస్టు 17 (రిపబ్లిక్ న్యూస్):** గుంటూరు, గుంతకల్లు రైల్వే మార్గంలో 401.47 కిలోమీటర్ల మేర చేపడుతున్న డబ్లింగ్ మరియు విద్యుద్దీకరణ పనులకు సంబంధించి నంద్యాల జిల్లా డోన్ మండలం డోన్ గ్రామంలో భూసేకరణ చేసిన భూములను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పరిశీలించారు. సోమవారం డోన్ గ్రామంలో భూసేకరణ చేసిన ఎ.1.58 సెంట్ల భూమితోపాటు, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు వారి స్వాధీనంలో ఉన్న మొత్తం ఎ.3.38 సెంట్ల భూమి మరియు రహదారిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో డోన్ రెవెన్యూ డివిజనల్ అధికారి పీవీ నరసింహారావు, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) తరపున సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీ ఆనంద్, డోన్ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు. సదరు భూమిలో ఉన్న రహదారిని సమీపంలోని పరిశ్రమల వారు వినియోగించుకునేలా పరిశ్రమల ప్రతినిధులు మరియు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీ ఆనంద్ అంగీకరించారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల అవసరాల కోసం ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి భూసేకరణ చేయాలని ప్రతిపాదించిన ఎ.2.32 సెంట్ల భూమిని భూసేకరణ ప్రక్రియ నుంచి ఉపసంహరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, అందుబాటులో ఉన్న రహదారిని సమర్ధవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు

**పీజీఆర్ఎస్ వినతులపై నిర్లక్ష్యం వద్దు**

**పరిష్కారం సాధ్యం కాని అంశాలపై కారణాలను స్పష్టంగా తెలియజేయాలి: కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 17)**ప్రజల నుంచి అందుతున్న వినతులను సకాలంలో నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతున్న ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించాలని అధికారులను ఆదేశించారు.తక్షణమే పరిష్కరించడం సాధ్యం కాని సమస్యల విషయంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులను పూర్తిగా తగ్గించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కార్యక్రమంలో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపియుడబ్లుజె ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

# నంద్యాలలో జెండావిష్కరణ

**ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం**

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం**






**నంద్యాల క్రైం, ఆగస్టు 17, (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్లుజె) 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎపియుడబ్లుజె నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక త్రినేత్ర లాడ్జి ఆవరణలో ఎపియుడబ్ల్యుజె జెండాను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యాం సుందర్ లాల్, గౌరవ సలహాదారులు, సీనియర్ పాత్రికేయులు ఎం. జనార్దన్ రెడ్డి, కనకరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ భాష, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్ కుమార్ రెడ్డి, వైఫై బాషా, సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలనీ, రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలులో ఉన్న నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేకపోతున్నారని, బకాయిలున్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో హెల్త్ కార్డును అనుమతించుట లేదని, కావున జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ను ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. పథకం అమల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనీ, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకూ మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018-19లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదని, అందువల్ల ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలను, వారికి తగిన వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని, జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# హజ్ -2027 కు విమాన రాకపోకల తేదీలు ఖరారు

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల**

**మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, ఆగస్టు17( రిపబ్లిక్ న్యూస్) :** పవిత్ర హజ్ యాత్ర -2027 కోసం సౌదీ అరేబియాకు విమానాల రాకపోకల తేదీలు ఖరారు అయినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 8వ తేదీ నుండి ప్రారంభమై , మే 9వ తేదీవరకు ఇండియా నుండి సౌదీకి విమానాలు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. సౌదీ నుండి ఇండియా కు మే 21వ తేదీ నుండి జూన్ 20 వ తేదీవరకు తిరుగు ప్రయాణపు విమానాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతానికి విమాన రాకపోకల తేదీలు ఖరారు అయ్యాయని, ఏ ఏ ఏంబార్కేషన్ కేంద్రాల నుండి ఏ ఏ తేదీన విమానాలు వెళతాయి అన్న వివరాల నిర్ధారణ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఖరారు అయిన వెంటనే బహిరంగ ప్రకటన ద్వారా హాజీలకు ఈ సమాచారాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ ద్వారా చేరవేయడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్ల ను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల**

రాష్ట్రంలోని 10000 మంది ఇమాములు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపు కోసం కూటమి ప్రభుత్వం రూ.22.50 కోట్లు విడుదల చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రస్తుత ఏడాది ఏప్రిల్,మే,జూన్ లకు సంబంధించి మూడు నెలలకు గాను గౌరవ వేతనాల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇమాములకు రూ.10,000, మౌజన్ల కు రూ. 5,000 ప్రకారం మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని సంబంధిత మసీదు కమిటీల బ్యాంక్ అకౌంట్లకు నేరుగా జమ చేసే ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తూనే, వారికి ఇచ్చిన హామీలన్నింటిని కార్యాచరణ బద్ధంగా నెరవేర్చడం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com